# కొలువు-కైవల్యం

'శ్రీవిరించి'



"మీరు ఎలాగైనా ఈ రోజు నన్ను ఆయన దగ్గరకు తీసుకు వెళ్లాలి!" అన్నాడు సుఖదేవ్.

అతను ఇంకా గదిలోకి వస్తూనే ఉన్నాడు. మాట్లాడుతూనే ముందుకు నడుస్తున్నా డన్నమాట!

నే నింకా ఉదయం న్యూస్ పేపరు చదవడం ముగించలేదు. ఇప్పుడే సంపాదకీయం చదవడం పూర్తి చేసి, కింది 'ఆలోచన సూక్తులు' వరికిస్తున్నాను. అతని మాటలకు ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచించడంలేదు నేను. అదేమంత ప్రధానమైన విషయం కానే కాదు నా దృష్టిలో: అప్రధానమైన స్థానం కూడా ఇవ్వనక్కర్లేదు దానికి.

"మాట్లాడ రేం?" అన్నా డతను కుర్చీలో పూర్తిగా విరామంగా స్థిరపడిన తరువాత.

"ముందు కాఫీ కానివ్వండి!" అన్నాను.

"కాఫీలు, బర్ఫీలు మన ప్రమేయం అక్కర్లేకుండానే వస్తాయి. చక్కగా ఆరగిస్తాము. అది సరే, సూఫీ వేదాంతంమటుకు మనం వెదుక్కుంటూ వెళ్లవలసిందే కదా! అలాగే కొత్త కొత్త పనులు చేయవలసి ఉంది!" అన్నాడు అతను - సమయం మించిపోతుందనే కించ కనబరుస్తూ ముఖంలోనూ, గొంతులోనూ కూడా.

"ఇప్పు డేమంత తొందర?" అని అడిగాను.

మరీ తప్పనిసరి అయితే తప్ప ఏ పని చేయడానికీ ఉత్సాహం చూపించను నేను. కాలం మించిపోతోందనీ, మళ్లీ తిరిగి రాదనీ - ఇలాంటి భ్రమలు ఏమీ లేవు నాకు.

"మీరు అట్లాగే అంటారు. అట్లా అంటూనే సంవత్సరాలు గడిపేస్తున్నారు. నే నింక ఆలస్యం భరించలేను!"

"ఎందుకంత విరహం?"

సుఖదేవ్ ముఖం మారిపోయింది. ఎంతో సీరియస్‌గా చెబుతూంటే ఈయన ఇంత ఆషామాషీగా, యథాలాపంగా తీసుకుంటా రేం - అన్న దృష్టి స్పష్టంగా కనిపిస్తోంది ఆ ముఖంలో.

"నిన్ననేగా చూశారు?" అన్నాను మళ్లీ - అతన్ని సమాధానపరచాలనే ఉద్దేశ్యంతో.

"ఆ చూడటం చూడటమే కాదు. వేలాది జనం మధ్య అందరిలో ఒకడినై ... ఆయన మాటలను గాలితో, వెలుతురుతో, అశేష జనసమూహంతో పంచుకుంటూ వినడం కాదు నేను కోరుకుంటున్నది!"

కాఫీ, బిస్కెట్లు వచ్చాయి ట్రేలో.

సుఖదేవ్ ఒక కప్పు నాకు అందించి, తన కప్పు తీసుకుని కూర్చున్నాడు.

ఇద్దరం బిస్కెట్లు నంచుకుంటూ కాఫీ తీసుకుంటున్నాము.

మధ్యలోనే తన ఉత్సాహాన్ని తీవ్ర సంకల్పాన్ని నీరసపరచకుండా సుఖదేవ్ మాట్లాడుతూనే ఉన్నాడు.

"చూడండీ, గడిచిన నాలుగేళ్లు లాగా మీరు ఈ సంవత్సరం కూడా తాత్సారం చేసి నన్ను మభ్యపెడితే ఊరుకోను!"

"న న్నేం చేయమంటారు - చెప్పండి!" అన్నాను - కథ మొదలుపెట్టించా లనే ధోరణిలో.

"ఇప్పటికి వెయ్యిసార్లు చెప్పాను. మళ్లీ మళ్లీ నాచేత వాగించి నన్ను వెర్రివాడిని చేసి

వదిలేస్తున్నారు గాని, నా విషయంలో చీమంతైనా కనికరం చూపడంలేదు మీరు!"

"చాలా పొడవైన సంభాషణలు ఇంటి దగ్గర ఆలోచించుకుని తయారుచేసుకుని వచ్చారు. బాగానే ఉంది. కాని వీటన్నిటికీ నేను చెప్పిన సమాధానాలు కూడా మీ దగ్గర సిద్ధంగానే ఉన్నాయి కదా!"

"మీ సమాధానాలు నాకు సమాధానం తీసుకురావడం మానేసి చాలా కాలం అయింది." అంటూ అతను ఖాళీ కప్పు ట్రేలో ఉంచుతూ, చివరి బిస్కెట్ కటకట కొరుకుతూ కోపంగా ఇలా అన్నాడు -

"ఈ రోజు తప్పదు. నేను సత్యాగ్రహం చేయబోతున్నాను. తరువాత మీ ఇష్టం!"

నాకు నవ్వు వచ్చింది. కాని పైకి నవ్వితే సుఖదేవ్ ఇంకా అపార్థం చేసుకుంటాడని, కోపం తెచ్చుకుంటాడని - అందుకు అవకాశం ఇవ్వకుండా పెదవులు నొక్కుకుని కూర్చున్నాను.

"ఇవాళ మీరు ఎలాగూ ఆఫీసుకు వెళ్లరు కదా!" అన్నా డతను.

"నా కేం తెలుసు? కారు వస్తే వెళ్లాల్సి ఉంటుంది. వెళ్లడం, వెళ్లకపోవడం నా మీద ఆధారపడిన విషయం కాదు!" అన్నాను.

"అవుననుకోండి! అయినా ఉదయం ఇంతవరకు న్యూస్ పేపర్ వ్యవహారంతోనే గడిచిపోతోందంటే, ఇక ఆఫీసు ప్రసక్తి లేనట్లే కదా!" అన్నాడు మళ్లీ.

నవ్వి ఊరుకున్నాను.

"అన్నిటికీ అలా నవ్వేసి ఊరుకోవడం మీకే సాధ్యమవుతుంది. . నేనుమటుకు చాలా సీరియస్‌గా చెబుతున్నాను సుమండీ! ఇవాళ నన్ను తీసుకువెళ్లవలసిందే!"

"నా ప్రశ్నకు మీరు సమాధానం చెప్పలేదు. ఆ సంగతి మరిచిపోతే ఎలా?" అన్నాను.

సుఖదేవ్ ఉలిక్కిపడ్డాడు.

"ఏమి టా ప్రశ్న? 'ఇప్పు డేమంత తొందర?' అనేగా! దానికి సమాధానం చెప్పాలా నేను? ఏమని చెప్పను చెప్పండి! ఈ ఒక్క కోరికతో వేగిపోతున్నాను, కాగిపోతున్నాను. కాలగర్భంలో కలవకముందే నన్ను ఈ కోరిక తీర్చుకోనివ్వండి!" చాలా బరువుగా, మాటలు ఆచి తూచి అన్నాడు అతను.

"పొద్దుట్నుంచి ఈ ఆలోచనతో సతమత మవుతున్నారన్నమాట!" అన్నాను.


"నిన్న సాయంత్రం నుంచి ఇదే తీవ్రత. ఇంకో పని తోచదు. మనస్సు మొరాయించు క్కూర్చుంది. ఎందుకో తెలియదు. ఇం కేదీ జీవితంలో నన్ను ఇలా ఇబ్బంది పెట్టలేదు!"

"మీరు చేసిన ముఖ్యమైన పను లేమిటో చెప్పండి."

"ఏమిటి? జీవితంలోనా? నిన్నటి రోజునా?"

"రెండూనూ."

"అబ్బాయి చదువు, రాజాలాంటి ఉద్యోగం. అమ్మాయి పెళ్లి, అల్లరి పెట్టని అల్లుడు. దాంతోనే అరవైయ్యేళ్ల జీవితం గడిచిపోయింది. పోతే, నిన్న నంటారా? మళ్లీ ఆ ఉపన్యాసం వినడం, దాని గురించే ఆలోచిస్తూ కూర్చోవడం - అయ్యా! మీకు ఎంతైనా పుణ్యం ఉంటుంది. విషయం దాటేసి




నన్ను మళ్లించడానికి ప్రయత్నించకండి! ఈ రోజు తప్పదు! మళ్లీ మాట్లాడితే తప్పదు గాక తప్పదు!"

"అంతగా చెప్పాలా మీరు! అయినా 'ఏమంత తొందర చెప్పండి?' అదే నేను అడిగేది!" అన్నాను.

"ఆయన ఇక్కడ ఉండేదే పది వారాలు. అందులో అప్పుడే నాలుగు వారాలు అయిపోయాయి. మధ్యలో ఇం కెక్కడికో వెళ్లివస్తారని కూడా చూచాయగా వింటున్నాను. అయ్యా! న న్నెందుకు క్షోభ పెడతా రు? ఒక్కసారి తీసుకువెళ్లి ఆయన ముందు కూర్చోబెట్టండి. ముఖాముఖి, సందర్శనం ఏర్పాటు చేయించండి!"

ఈ పనితో నాకు ఏమాత్రం సంబంధం, సంపర్కం లేదు. ఇదే మాట సుఖదేవ్‌కు అనేకసార్లు చెప్పడం కూడా అయిపోయింది. అయినా వినడు, వినిపించుకోడు.

అతనికి పట్టుదల ఉంటే ఉండవచ్చును. ఆ పట్టుదల చాలా మంచి పనికోసమే కావచ్చును. దానితో నా కేమిటి నిమిత్తం?

"చూడండీ, మీరు ఆయన ఉపన్యాసాలు ముఖతః వింటున్నారు. ఏమీ అశ్రద్ధ చేయకుండా డిస్కషన్ మీటింగ్‌లు కూడా హాజరవుతున్నారు. ఆయన 'ప్రశ్నలు వేయండి' అన్నప్పుడు మీరు ఏదైనా చర్చించదలచుకుంటే ఆ అవకాశం ఉండనే ఉంది. అయినా ఇంతవరకు మీరు అలాంటి సంభాషణల్లోకి దిగడం నేను చూడలేదు. మౌనంగా, ధ్యానంగా, మార్దవంగా ఆయన 'సహవాసాన్ని' సాధ్యమైనంతవరకు అనుభవిస్తూనే ఉన్నారు. ఇంకా మీ కెందుకు ఈ విపరీతమైన కోరిక, చెప్పండి!"

"నే నేమీ మాట్లాడను. వారికి ఇబ్బంది కలిగించను. చొప్పదంటు ప్రశ్నలతో విసుగు తెప్పించను. ఊరికే ... అనుమతించినంతసేపూ ఆయన ముందు కూర్చుంటాను! అంతే! ఆయన విప్పమంటే తప్ప పెదిమలు కదల్పను!"

"అలా చూస్తూ కూర్చునే అవకాశం మీకు మీటింగులలో వస్తూనే ఉంది. ఇంకా ఎందుకు ఈ వెంపర్లాట?"

"ఏమో తెలియదు. నాకే అర్థం కాదు. ఎందుకు ఇలాంటి కోరికతో వేగిపోతున్నానో తెలియదు. ఈ పని మాత్రం ఈ రోజు చేయక తప్పదు. నా జన్మ వృథా అయిపోతుంది లేకపోతే. నాకు ఊపిరి సలపదు! పిచ్చివాడినైపోతా ననుకుంటాను!"

"సరే, బాగానే ఉంది. మీ అపేక్షతో, ఈప్సితంతో నా కేం సంబంధం ఉన్నదని నన్ను ఇబ్బంది పెడుతున్నారు? నాకు చేతకాని పని నన్ను చేయమని ఎందుకు సత్యాగ్రహం చేస్తామంటున్నారు?" అనడిగాను ఇంతకంటే స్పష్టంగా మాట్లాడటం ఎలాగో తెలియక.

"మీకు చేతగాని పనా? మీకు ఏమీ సంబంధం లేని పనా?" అన్నాడు సుఖదేవ్ - నోరంతా తెరుచుకుని, ఇలాంటి 'విషం'లాంటి మాటలు వినడంతో గొంతు మండిపోతున్నట్లు, చెవులు కాలిపోతున్నట్లు, కడుపు తరుక్కుపోతున్నట్లు ముఖంపెట్టి.

"రకరకాలుగా చెప్పాను - ఇదివరకే మీకు. కాని అర్థం చేసుకోరు నన్ను. నా కేం సంబంధం చెప్పండి. ఆయ నేమన్నా నా అధీనంలో ఉన్నారా? నా చెప్పుచేతల్లో ఉన్నారా? ఆయనకు నే నేం సిఫారసులు తీసుకుపోగలను? నా కేం పలుకుబడి ఉన్నదని? అసలు ఇలాంటి పలుకుబడుల కోసం, గౌరవ మర్యాదల కోసం నాకు సుతరామూ గిట్టదని మీరు ఎరుగుదురు కదా! ఎందుకు నన్ను ఇబ్బంది పెడతా రు?" అన్నాను - ఇంత దీర్ఘంగా మాట్లాడవలసి వచ్చినందుకు నొచ్చుకుంటూనే.

ఎవరో వచ్చారు.

సుఖదేవ్ అతనివంక చాలా ఈర్ష్యగా, అసహనంగా చూశాడు.

ఆ మనిషి నాతో అయిదు నిముషాలు ఏవో సంగతులు మాట్లాడి వెళ్లిపోయాడు. ఆ అయిదు నిముషాలూ సుఖదేవ్ చాలా ఇబ్బందిగా కుర్చీలో కదులుతూ ఉండటం గమనిస్తూనే ఉన్నాను.

ఏమిటి? ఎందుకు? - ఇలాంటి ప్రశ్నలు వేసే సందర్భాలు కొన్ని ఉంటాయి. కొన్నిసార్లు నోరుమూసుకు వినడమే తప్ప ఇం కేమీ కర్తవ్యం ఉండదు. సుఖదేవ్ అతను వెళ్లిపోగానే మళ్లీ ప్రారంభించాడు.

"మీ కేం సంబంధం అంటారా? మీకు తప్ప ఇతరులకు ఇందుతో ఏం సంబంధం ఉన్నదో నాకు అర్థం కాదు, తెలియదు. అసమాధానంతో నేను మగ్గిపోతూ ఉంటే, జీవిత మంటేఅర్థం కాక, మృత్యువును పోల్చుకోలేక సుఖం, దుఃఖం అనే ద్వంద్వాలలో పడి కొట్టుకుపోతూ ఉంటే నన్ను ఒక స్థాయిలో నించోబెట్టి ఆ మనిషిని గురించి, ఆయన తత్త్వ దర్శనాన్ని గురించీ చెప్పింది మీరు! ఆ వేదాంతం వైపు మనసు మళ్లించింది మీరు! అవునా, కాదా?"

"అవునో, కాదో నేను సమాధానం చెప్పలేను. అది పూర్తిగా మీకు సంబంధించిన విషయం. నే నేదో సూచనగా చెప్పి ఉంటాను. పోనీ, పట్టుదలగానే చెప్పా ననుకుందాం. ఆ విషయంలో అభిరుచి తీసుకుని అది మీకు సరిపడిందనీ, ఉపకరించిందనీ నిర్ణయించుకున్నది మీరు. ఈ మార్గంలో ఆలోచించడం శ్రేయోదాయకం అని నిర్ధారించుకున్నది మీరు. మీ నిర్ణయాలు, నిర్ధారణలు మీవి. వాటితో నాకేం సంబంధం లేదు కదా!"

"తార్కికంగా అంతే ననుకోండి! అయినా, మీరు ఆయన్ను ఎరుగుదురు. నన్ను తీసుకువెళ్లి కూర్చోబెట్టగలరు అతని ముందు. కాని ఎందుకు చేయ రా పని? ఎన్నిసార్లు బతిమిలాడినా, బెంగ అంతా మీముందు పరిచినా మీకు కనికరం లేదే!"

"అయ్యో! మళ్లీ మొదటికి వస్తున్నారు. అయనతో నాకు పరిచయం ఉండవచ్చు. ఆయన నా మాట వినవచ్చు. కాని నేనే ఎప్పుడూ ఆయనతో తీరుబడిగా మాట్లాడను. అలా మాట్లాడగల సందర్భాలు నాకు రాలేదు. మీరు ... మీరు ఏం మాట్లాడా లనుకున్నా నేరుగా వెళ్లవచ్చును కదా! మధ్యవర్తిత్వం ఎందుకు? అది ఆయన చెప్పే జీవన విధానానికి పూర్తిగా వ్యతిరేకం కదూ!"

"ఆ మాట నిజమే కానీ, ఎందుకో చెప్పలేను. నా ఆలోచనే నాకు సరైనదిగా, సజావుగా, ఏమీ లోటుపాట్లు లేనిదిగా కనిపిస్తోంది. మీరు నన్ను తీసుకువెళ్లక తప్పదు!" అన్నాడు సుఖదేవ్.

"నే నెవర్ని? నా కేం అధికారం ఉంది?"

"అధికారమో, కాదో నాకు తెలియదు. కాని మీ కా అవకాశం ఉంది. అంతే! ఇంతకంటే ఇంకేమీ చెప్పలేదు!" అని మిన్నకుండిపోయాడు.

"అయినా ఎందుకు మీకు ఈ ఉబలాటం? ప్రశ్నించుకుని చూసుకోండి! ఆయనతో ఏం మాట్లాడతారు? ఊహించుకోండి!"

"ఏమో, నాకు తెలియదు. ప్రస్తుతం నాకు ఏమీ ఆలోచన లేదు."

"మ రెందుకు చూడటం?"

"ఎందుకో తెలియదు. అయనను ప్రశ్నలు వేసి సమాధానాలు చెప్పించుకునేంత తెలివితేటలు, వికాసం నాకు లేవు. ఆయన అనుమతిస్తే ఆయన పాదాల దగ్గర తలకాయ చేర్చి కడుపార ఏడుస్తాను."

"ఆయన అనుమతించరు!"

"ఆయన ఒప్పుకుంటే ... ఆయన చేతులు నా చేతుల్లోకి తీసుకుని నా నెత్తిన పెట్టుకుంటాను. గుండెకు అదుముకుంటాను. ముఖానికి అలుముకుంటాను."

"ఆయన ఆ పని చేస్తారేమో నాకు తెలియదు. అభ్యంతర పెట్టకపోవచ్చును. కాని ఏమిటి మీకు ఫలితం? ఆయన్ని కొన్ని నిమిషాలు డిస్టర్బ్ చేయడంకంటే మీరు తీసుకువచ్చే పరిణామం ఏమిటి?"

"ఆయన డిస్టర్బ్ చేసినా నా కేం బా ధేమీ లేదు. అలా చేస్తే నా డిస్టర్బెన్స్ చాలామటుకు తగ్గుతుందని నా ఆశ, నా నమ్మకం!"

సుఖదేవ్ ముఖంలోకి చూశాను - సూటిగా, ప్రశ్నార్థకంగా. "అది స్వార్థం కదూ! అవతలి మనిషి ఇష్టాయిష్టాలతో, అనుకూల ప్రతికూలాలతో ఏమీ నిమిత్తం లేకుండా మన ఊహకు, మన ఆలోచనకు వచ్చిన పనిని ఆ మనిషిచేత చేయించేసెయ్యటం! మనకే స్పష్టంగా తెలియని ..." ఇంకా ఏమిటో అంటున్నాను.

సుఖదేవ్ కన్నీరు కారుస్తున్నాడు అప్పుడే.

రుమాలుతో కళ్లు, చెక్కిళ్లు తుడుచుకునే ప్రయత్నం కూడా చేయడంలేదు. అలా ధారలు కారుతున్నాయి.

అదే ఆయనకు మంచిది. విశ్రాంతి, విరామం తీసుకువస్తుంది అని నేను అలాగే చూస్తూ కూర్చుండిపోయాను.

ఊరడించడానికి చూడలేదు. ఏమిటి ఈ బేలతనం అని మందలించ ప్రయత్నించలేదు.

ఆ మధ్యాహ్నం -

భోజనం చేసి రెండు గంటలు విరామంగా నిద్రపోయిన తరువాత ఒక అరగంట వీడియోలో ఆయన ఉపన్యాసం చూస్తూ, వింటూ తృప్తితో హృదయం నిండిపోయిన మీదట బయలుదేరాం.

పోర్టికోలోకి వచ్చి 'మారుతి జెన్'లో సుఖాసీనుల మయ్యాం.

డ్రైవర్ దండాయుధపాణి తన మామూలు అలవాటు ప్రకారం ఏమాత్రం ఆయాసం అనిపించకుండా, ఒళ్లు కదలకుండా కారు నడుపుతున్నాడు.

వంతెన దాటాము.

ఒకపక్క మల్లెపువ్వుల పరిమళం, మరోపక్క సముద్రంలో కలియబోతున్న నదిలో పేరుకున్న బురద, మురికి - అసహ్యమైన వాసన.

బహు దూరం నేరుగా నడిచిన రోడ్డు పొడుగునా గడిచి ఎడమవైపు తిరిగింది కారు.

దారిలో అడ్డంగా అమర్చిన వెదురు కర్రల 'బారియర్లు' దాటుకుంటూ, ప్రశాంతమైన ఆవరణలో ప్రవేశించింది కారు. పోర్టికోలో దండాయుధపాణి కారుతో సహా ఆగిపోయాడు.

మేమిద్దరం హాల్లో ప్రవేశించాము. మెట్లు ఎక్కి పైకి వెళ్లాం. విశాలమైన గది. దూరంగా ఒక మూల చిన్న టేబుల్, దాని మీద రెండో మూడో పుస్తకాలు.

మరో మూల తెల్లని దుప్పటి పరిచిన మెత్తటి పరుపు, మంచం. దుప్పటి ఏమాత్రం నలిగి లేదు. అప్పుడే ఆవిర్భవించినట్లు ఉంది.

మరోపక్క చేతులు లేని కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని ఉన్నారు ఆయన.

మేము గదిలోకి ప్రవేశించి లోపలకు చూసిన మొదటిసారి అరకన్నుల మూతలలో ఏదో ఆలోచనలో ఉన్నట్లు మ రేదో లోకంలో ఉన్నట్లు నిండైన ఆ కోలముఖం అసాధారణ సౌందర్యం ప్రసారం చేస్తోంది.

ఆ కళ్లు ...

కారుణ్యాన్ని నిరవధికంగా, నిరతిశయంగా స్రవిస్తున్న విశాల నేత్రాలు.

మమ్మల్ని గమనించి కుర్చీలోనుంచి లేచారు.

నాలుగు అడుగులు ముందుకు వేసి, వద్దని నేను వారిస్తు న్నా కూడా మా వైపు వస్తున్నారు.

"రండి!" అన్నారు ఆహ్వానిస్తూ చేతులు చాపి.

నమస్కారం చేశాము మామూలుగా రెండు చేతులూ జోడించి.

"ఇతను ... ఇతను మమ్మల్ని చూడాలని ఒకటే తహతహ! బాగా చదివాడు. జీవితాన్ని అనుభవించి అర్థం చేసుకున్నాడు!" అన్నాను - ఎక్కువ చెప్పడం అనవసరమని తెలిసినా.

ఆయన సుఖదేవ్ చేతులు తన. చేతుల్లోకి తీసుకున్నారు.

రెండు చేతులూ చాలాసేపు స్పృశించారు

ఆ చేతులు తన తల మీదకు చేర్చుకున్నారు.

గుండెల మీద రాసుకున్నారు.

ముఖానికి అలుముకున్నారు.

కాంతు లీనుతున్న కళ్లతో సుఖదేవ్ వంక నిదానంగా, నిర్నిమిత్తంగా చూశారు.

మాటలు లేవు.

ఎన్నో భావాలు ఆయన నుంచి మా హృదయాలను తా కుతు న్నాయి.

గొప్ప కాంతి.

నూతనమైన తేజస్సు!

పరిమళాలకు అతీతమైన పరిమళంలో తేలియాడుతున్న వాతావరణం! అది ఆకాశం అంతటా అలుముకుంటోంది.

ఎంతసేపు ఆ 'స్నిగ్ధత'లో మునిగిపోయి కూర్చున్నామో తెలియదు. సుఖదేవ్ ఏ లోకంలో ఉన్నాడో నేనైతే అంచనా వేయలేను.

ఎవరో గదిలోకి వచ్చిన చప్పుడు అయినప్పుడే మళ్లీ మాకు స్పృహ.

టీ, బిస్కెట్లు - ఆయన చేతుల మీదుగా టీ కప్పు అందుకున్నాడు సుఖదేవ్.

"జీవితంలో పరిపూర్ణత అంటే ఏమిటో తెలిసివచ్చింది నాకు. జన్మజన్మలకూ దాచుకోవలసిన విషయం ఇది నాకు!" అన్నాడు సుఖదేవ్ రాత్రి భోజనం చేశాక.

టీ.వీ.లో వార్తలు సమాప్తం అయ్యాయి.

మా సుమప్తి సమారంభం అయింది.

## ఎలా?

"ఒరేయ్! రోడ్ల మీద జులాయిగా తిరుగుతున్నావ్ ఎప్పుడయినా నాన్నగారి బరువు, బాధ్యతలు తెలుసుకున్నావా" అడిగింది తల్లి.

"ఆ.. నాన్నగారి బరువు అరవై కేజీలు. మరి బాధ్యత తెలుసుకునే దెలా అమ్మా!" అమాయకంగా అడిగాడు కొడుకు.

సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి [కొమరగిరిపట్నం]